ఒక్కో అధికారి..ఒక్కోలా..

- ప్రజావాణిలో సమయపాలన పాటించని మండల అధికారులు
- వికారాబాద్ కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- ఆఫీసర్లు సమయానికి రాకపోవడంతో ఇబ్బందుల్లో ప్రజలు
- సమస్యలు చెప్పకొనేందుకు నానా తిప్పలు

పెద్దేముల్, జూలై 8 : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల మండల అధికారులు సమయానికి రావడంలేదు. ఒక్కో అధికారి వారికి అనుకూలంగా ఉన్న సమయానికి దర్జాగా వస్తున్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు అధికారులు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించాలి. కానీ, మండలంలోని అధికారులు మాత్రం కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. సోమవారం ఉదయం 10:30 నుంచి ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం కాగా నిర్ణీత సమయంలో ఎంపీడీవో జర్నప్ప, తహసీల్దార్ కిషన్, ఎంపీవో రమేశ్‌కుమార్, ఏపీవో నర్సింహులు, వెటర్నరీ డాక్టర్ వెంకట్‌రాజు మాత్రమే హాజరయ్యారు. తరువాత 10:46కు ఏవో నజీరోద్దీన్, 10:49కి కంప్యూటర్ ఆపరేటర్ ఈశ్వర్, 10:53కు ఏపీఎం బాలయ్య, 11:15 కు లైన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌సింగ్, 11:30కి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హేమంత్‌కుమార్, మధ్యాహ్నం 12 గంటలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి వారికి అనుకూలంగా ఉన్న సమయానికి వచ్చారు. మిగతా అధికారులు హాజరే కాలేదు. ప్రజావాణి ప్రారంభమైన రోజు నుంచే మండలంలో ఇదే తంతు సాగుతున్నదని ప్రజలు, ఫిర్యాదులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ప్రజావాణి కార్యక్రమం పూర్తి కాకముందే కొందరు అధికారులు మధ్యలోనే వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రజలు తమ అర్జీలను ఇచ్చేందుకు ఇబ్బందిపడుతున్నారు. సమయపాలన పాటించని అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా సోమవారం బాయిమీదితండా గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యకు సంబంధించి ఓ ఫిర్యాదును అధికారులు స్వీకరించారు.

పెద్దేముల్ : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదును స్వీకరిస్తున్న తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో జర్నప్ప

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ : ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉషశ్రీ, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి రెండు, ఎంపీడీవో కార్యాలయంలో ఒక్క దరఖాస్తు వచ్చినట్లు వారు చెప్పారు. వచ్చిన దరఖాస్తులను పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులను పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమర్, వ్యవసాయాధికారి ఏడీఏ శంకర్‌రాథోడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొడంగల్ : ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

తాండూరులో మూడు ఫిర్యాదులు

తాండూరు రూరల్ : తాండూరు మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కి మూడు ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ తారాసింగ్, ఎంపీవో రతన్‌సింగ్ తెలిపారు.

మర్పల్లిలో దరఖాస్తులు నిల్

మర్పల్లి : మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక్క దరఖాస్తూ రాలేదని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, తహసీల్దార్ గణేశ్, ఏపీఎం అంజిరెడ్డి, ఏపీవో మధుకర్ పాల్గొన్నారు.

ధారూరులో రెండు..

ధారూరు : ప్రజావాణి కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో నర్సింహులు తెలిపారు. కార్యక్రమంలో ధారూరు తహసీల్దార్ షాజిదాబేగం, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీవో, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తు అందిస్తున్న సల్బత్తాపూర్ రైతులు

బంట్వారంలో ఒక దరఖాస్తు

బంట్వారం (కోట్‌పల్లి) :మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక దరఖాస్తే వచ్చిందని ఎంపీడీవో రాములు తెలిపారు. సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు బావిలో పూడికతీత పనులు చేపట్టినా బిల్లులు చెల్లించలేదని, వెంటనే అధికారులు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీవో విజయ్‌కుమార్, ఏఈ వేణుమాదవ్ ఇతర శాఖల అధికారు లు పాల్గొన్నారు. కాగా కోట్‌పల్లిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు

సన్మానం పొందిన ధారూరు మండల ప్రజా పరిషత్ పాలకవర్గ సభ్యులతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

ధారూరును ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం

ధారూరు, జూలై 8 : రానున్న రోజుల్లో వికారాబాద్ నియోజకవర్గ రూపురేఖలను మార్చుతామని.. ధారూరును ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో జరిగిన ధారూరు మండల ప్రజాపరిషత్ పాలకవర్గ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయలక్ష్మీహన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, జడ్పీటీసీ సుజాతావేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్వేతానరోత్తంరెడ్డి, నర్సమ్మ, బసప్ప, రవికుమార్, కో-ఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్‌లకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వికారాబాద్ నియోజకవర్గ రూపురేఖలను మార్చుతామని.. ధారూరును ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. ధారూరు మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రూ. 110 కోట్లు మంజూరైనట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ధారూరు ఎంపీడీవో నర్సింహులు, తహసీల్దార్ షాజిదాబేగం, ఎంఈవో బాబుసింగ్, ఏపీవో సురేశ్, నాయకులు హన్మంత్‌రెడ్డి, సంతోష్‌కుమార్, రాములు, విజయభాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా లక్ష్మణ్‌గుప్తా

వికారాబాద్ : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆర్యవైశ్య భవనంలో ఆదివారం రాత్రి జరిగిన ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరానికి రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం పాలకవర్గం అలాగే ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌గుప్తా, ఉపాధ్యక్షుడు రఘునందన్, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్, సహాయ కార్యదర్శి వేణుగోపాల్, పాలకవర్గ సభ్యులు.. ఆర్యవైశ్య సం ఘం మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సువర్ణ, కోశాధికారి మమత, కార్యవర్గ సభ్యులు.. ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షుడు భరత్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌తో సహా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ ఆర్యవైశ్య సంఘం తరపున శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న అంకిత ఫౌండేషన్ సభ్యులు

వలస కూలీల పిల్లలు చదువుకోవాలి

వికారాబాద్, జూలై 8 : వలస కూలీల పిల్లలందరూ చదువుకోవాలని అంకిత ఫౌండేషన్ వికారాబాద్ డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కొటాలగూడ ప్రాథమిక పాఠశాలలో 94 మంది విద్యార్థులకు అంకిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, చెప్పులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల వారి పిల్లల చదువు మధ్యలోనే ఆగిపోతున్నదని.. అలాంటి పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు చదువు ప్రాధాన్యాన్ని వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు తెలిపారు. వలస, భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగ్గా ఈ శ్రమ్, లేబర్ కార్డులను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, అంకిత ఫౌండేషన్ వికారాబాద్ మండల కోఆర్డినేటర్ సంజీవరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

సబ్‌యూనిట్ అధికారి ఫకీరప్ప

కొడంగల్, జూలై 8 : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా జబ్బులను నివారించొచ్చని సబ్‌యూనిట్ అధికారి ఫకీరప్ప పేర్కొన్నారు. సోమవారం స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ముందుగా పాఠశాల ఆవరణను పరిశీలించి నీటి నిల్వ గుంతల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ దోమకాటుతో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని.. అందువల్ల దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది రేణుక, మంజుల, ఆశ వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్న సబ్‌యూనిట్ అధికారి ఫకీరప్ప

దోమ : లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహిళల అభ్యున్నతికి కృషి

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

దోమ, జూలై 8 : మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌డ్డితో కలిసి ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 138 మంది లబ్ధిదా రులకు రూ.1,38,16,008 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం త్వరలోనే కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నదన్నారు. అంతేకాకుండా మహిళా సంఘాలకు ప్రత్యేక రుణాలను మంజూరు చేసే దిశగా కృషి చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలదని పేర్కొన్నారు. అనంతరం గతేడాది అయినాపూర్ గ్రామానికి చెందిన బాల్‌రాజ్ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందగా ఆయన భార్య సువర్ణకు విద్యుత్ శాఖ తరపున మంజూరైన రూ.4లక్షల చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు యాదవరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆశన్నగౌడ్, యాదయ్యగౌడ్, శాంతకుమార్, రమేశ్, తహసీల్దార్ పురుశోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు, ఏవో ప్రభాకర్‌రావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిగిలో 95 మందికి..

పరిగి : మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పరిగిలోని క్యాంపు కార్యాలయంలో 95 మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించిందన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి చేస్తున్నదన్నారు. అంతేకాకుండా పేదలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును అందిస్తున్నదనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాఠశాలల హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, జూలై 8 : ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో హెచ్ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పనులు నాణ్యతతో ఉండాలని సూచించారు. మంచినీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిశుభ్రత తదితర పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్యగౌడ్, ఎంపీవో రతన్‌సింగ్, ఏఈలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

వికారాబాద్, జూలై 8 : పశుగ్రాసం విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని వికారాబాద్ మండల పశువైద్యాధికారిణి ఉష సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పశు వైద్యశాలలో సీఎస్‌హెచ్-24 రకం పశుగ్రాసం విత్తనాలు 75% సబ్సిడీపై పంపిణీ చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు ఇచ్చి పశుగ్రాసం విత్తనాలను తీసుకోవాలని సూచించారు. 5 కిలోల ధర రూ.113.75 ఉంటుందన్నారు.

ఇందూరు నూతన పంచాయతీ కార్యదర్శిగా బలరాం

పెద్దేముల్, జూలై 8 : మండలంలోని ఇందూరు గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా బలరాం నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఇందూరు పంచాయతీలో ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి రాజు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇందూరు గ్రామానికి చాలా రోజులుగా పర్మినెంట్ పంచాయతీ కార్యదర్శి లేక ప్రజ లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గొట్లపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాజు ఇం దూరు గ్రామానికి ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే యాలా ల మండలంలోని గంగాసాగర్ గ్రామ పంచాయ తీ కార్యదర్శిగా పనిచేస్తున్న బలరాం డిప్యూటేషన్‌లో భాగంగా ఇందూరు గ్రామానికి బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఢిల్లీలో బోనాల వేడుకలు.. తరలిన ఒగ్గు కళాకారులు

బొంరాస్‌పేట, జూలై 8 : ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించే బోనాల వేడుకల్లో పాల్గొనేందుకు మండలంలోని నాందార్‌పూర్‌కు చెందిన ఒగ్గు డోలు కళాకారులు సోమవారం తరలివెళ్లారు. ఒగ్గు డోలు ప్రదర్శనకు తెలంగాణ నుంచి 20 మంది కళాకారులను ప్రభుత్వం ఎంపిక చేయ గా.. అందులో వికారాబాద్ జిల్లా నాందార్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున ఒగ్గుకళ సేవాసమితి నుంచి ఒగ్గుబీరు, శివకుమార్, రాఘవేందర్, మల్లేశ్, భద్రయ్యలను అవకాశం వరించింది.

మర్పల్లిలో జాబ్ మేళా.. 46 మందికి ఉద్యోగాలు

మర్పల్లి, జూలై 8 : మర్పల్లి ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు 46 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎజాజ్ మసియుద్ధీన్ తెలిపారు. ఐదు కంపెనీలకు చెందిన ప్రతినిధుల సమక్షంలో ఈ మేళా నిర్వహించగా 46 మంది అభ్యర్థులు హాజరు కాగా అందరూ వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా జ్ఞానేశ్వర్

కొడంగల్, జూలై 8 : ఎంపీపీల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీవోలను స్పెషలాఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొడంగల్ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ బాధ్యతలు చేపట్టారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా

పరిగి, జూలై 8 : ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తికి పరిగి కోర్టు 6 నెలల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. పరిగి ఎస్ఐ సంతోష్ కథనం ప్రకారం.. మండలంలోని సయ్యద్‌మల్కాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్య ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అంజయ్య మామ సత్తయ్య 2012 ఫిబ్రవరిలో సయ్యద్‌మల్కాపూర్‌కు వచ్చి యాబాజీగూడకు చెందిన శేఖర్ అనే వ్యక్తికి కాంగ్రెస్ నాయకులతో మంచి పరిచయాలు ఉన్నాయని, అతడికి డబ్బిస్తే ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం వస్తుందని చెప్పాడు. దీంతో ఇరువురూ శేఖర్‌ను కలువగా రూ.1,50,000 ఇస్తే తప్పనిసరిగా ఆబ్కారీ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. 2012 మార్చి 5న పరిగి బస్టాండ్ దగ్గర అంజయ్య, సత్తయ్య కలిసి శేఖర్‌కు రూ.1,50,000 ఇచ్చారు. అనంతరం ఏప్రిల్‌లో జరిగిన ఎక్సైజ్ కానిస్టేబుల్ పరీక్షను అంజయ్య రాశాడు. మూడు నెలల తర్వాత ఫలితాలు రాగా అందులో అతడికి ఉద్యోగం రాలేదు. దీంతో మోసపోయానని భావించిన అంజయ్య.. సత్తయ్యను తీసుకుని శేఖర్ వద్దకెళ్లి డబ్బులు ఇవ్వాలని నిలదీశాడు. డబ్బులు రాకపోవడంతో 2015లో అంజయ్య తన స్వగ్రామానికి చెందిన రహీంపటేల్, సుంకరి విద్యాకుమార్, సుంకరి చంద్రయ్య, కుమ్మరి శ్రీకాంత్‌లతో కలిసి శేఖర్ ఊరైన యాబాజీగూడకు వెళ్లి అక్కడి సర్పంచ్ సమక్షంలో పంచాయితీ పెట్టాడు. అయినా డబ్బులు ఇవ్వకపోవడంతో 2017 లోస్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ ఓబుల్‌రెడ్డి కేసును దర్యాప్తు చేశారు. వాదోపవాదాలు విన్న తర్వాత పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎన్.శిల్పా శేఖర్‌కు 6 నెలల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కల్లు తాగి వ్యక్తి మృతి

తాండూరు రూరల్, జూలై 8 : కల్లు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కరణ్‌కోట ఠాణా పరిధిలో జరిగింది. ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని జినుగుర్తి గ్రామానికి చెందిన కొత్తపేట అంజిలప్ప(58)కు కల్లు తాగే అలవాటు ఉన్నది. ప్రతిరోజూ అతడు కల్లు తాగుతాడు. కాగా సోమవారం ఉద యం 5.30 గంటల సమయంలో అంజిలప్ప ఓ వీధిలో పడిపోయి ఉన్నాడని పంచాయతీ కార్మికుడు చెప్పడంతో అంజిలప్ప కొడుకు రమేశ్ అక్కడికెళ్లి చూడగా చలనం లేకుండా పడి ఉన్నాడు. అనంతరం ఇంటికి తీసుకెళ్లి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య కొత్తపేట శాంతమ్మ ఫిర్యాదు మేరకు కల్లు తాగి చనిపోయినట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి

పరిగి, జూలై 8 : స్కూల్ బస్సులు నడిపే వారు తప్పనిసరిగా అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని పరిగి ఎంవీఐ వీరేంద్రనాయక్ సూచించారు. సోమవారం పరిగిలో ప్రైవేట్ స్కూల్ బస్సుల యజమానులు, డ్రైవర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనం ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ట్యాక్స్, ఎఫ్‌సీ, పర్మిట్, పీయూసీ పత్రాలు తప్పనిసరిగా వాహనంలో ఉంచుకోవాలన్నారు. అలాగే వాహనానికి ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఉండాలని, మెడికల్ బాక్స్, ఫైర్ కిట్, ఇండికేటర్ లైట్లు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ కిశక్షర్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోకు కుచ్చుటోపీ

- ఏసీబీ అధికారులమంటూ బెదిరించి రూ.5 లక్షలు స్వాహా
- ట్రేస్ చేసి మహబూబ్‌నగర్‌లో పట్టుకున్న పోలీసులు

తాండూరులో వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

యాలాల, జూలై 8: ఏసీబీ అధికారులమంటూ ఫోన్ చేసి రూ.5 లక్షలు కొల్లగొట్టిన ముగ్గురు నిందితుల్లో ఇద్దరిని పట్టుకున్నట్లు సోమవారం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఏపీలోని అనంతపురం జిల్లాలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న కర్ణాటకకు చెందిన తరు ణ్‌గౌడ (19), అదే గ్రామానికి చెందిన ఆర్టీసీ మెకానిక్ ముజాబిద్(24), అనంతపురం జిల్లా కొట్టాలపల్లికి చెందిన జయకృష్ణ అలియాస్ జయసింహ ఒక ముఠాగా ఏర్పడి ఏసీబీ అధికారులమంటూ ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్ చేసి బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అదే క్రమంలో జూన్ 18న సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఎంపీడీవోగా పనిచేస్తున్న తాండూరు పట్టణానికి చెందిన బండి లక్ష్మప్పకు ఫోన్ చేసి బెదిరించారు. కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భయపడిన ఆయన ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా రూ. 5 లక్షలు పంపించాడు. ఆ తర్వాత ఆ పేరుగల అధికారులు ఏసీబీలో లేరని తెలుసుకున్నాడు. తాను మోసపోయానని భావించి జూన్ 20న తాండూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల ఫోన్‌నంబర్, బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ఉండగా సోమవారం తరుణగౌడ, ముజాహిద్‌లను అరెస్టు చేసి రూ.లక్షను స్వాధీనం చేసుకొన్నారు. ప్రధాన నిందితుడు జయకృష్ణ పరారీలో ఉన్నాడని, అతడిపై దాదాపు 30 కేసులు ఉన్నట్లు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు.